దివ్యాంగులు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి

● మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, కూకట్‌పల్లి ఎమ్మెల్యే కృష్ణారావు

కేపీహెచ్‌బీ కాలనీ, డిసెంబర్ 7 : దివ్యాంగులు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని, దివ్యాంగుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. శనివారం కూకట్‌పల్లి రంగధామని చెరువు గట్టుపై న్యూశక్తి దివ్యాంగుల సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచ దివ్యాంగుల దినోత్సవానికి ఎంపీ, ఎమ్మెల్యే ముఖ్య అతిథులుగా (వేర్వేరుగా) హాజరై.. దివ్యాంగులకు మోటర్ సైకిళ్లు, వీల్

కూకట్‌పల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే కృష్ణారావు, ఎంఈవో కిషన్ తదితరులు

చైర్స్, సంక కర్రలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. దివ్యాంగుల ఆత్మగౌరవాన్ని ప్రధాని మోదీ పెంచారని, విద్య, ఉద్యోగంలో మూడు శాతం ఉన్న రిజర్వేషన్లను నాలుగు శాతానికి పెంచారని అన్నారు. ఎమ్మెల్యే కృష్ణారావు మాట్లాడుతూ.. గతంలో దివ్యాంగులకు మోటర్ సైకిళ్లను అందించానని, భవిష్యత్‌లో మరికొందరికి మోటర్ సైకిళ్లను అందించడంతోపాటు ఎల్లప్పుడూ అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ప్రభుత్వం నుంచి దివ్యాంగుల పరికరాలను ఇప్పించేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో దివ్యాంగుల జాతీయ నాయకులు నాగేశ్వర్‌రావు, రాష్ట్ర నాయకులు బుద్దికొండ కిరణ్, సంస్థ అధ్యక్షుడు వెంకటస్వామి, కార్యదర్శి చిరంజీవి, శ్రావణ్‌కుమార్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు అభినందనీయం : ఎమ్మెల్యే మాధవరం

ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల కోసం ఉచిత వైద్యశిబిరం నిర్వహించడం అభినందనీయమని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. శనివారం కూకట్‌పల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నోవా ఈఎన్‌టీ వైద్యశాల, బీఆర్ఎస్ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరాన్ని ఎమ్మెల్యే కార్పొరేటర్ సత్యనారాయణ, ఎంఈవో కిషన్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విద్యార్థులకు ఎల్లప్పుడూ సహాయసహకారాలు అందిస్తానన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నరేందర్, డాక్టర్ మోహన్‌రెడ్డి, విద్యార్థి నాయకులు చైతన్యయాదవ్, సంతోష్‌యాదవ్, మహేశ్, లోకేశ్, అఖిల్, ఫణి తదితరులు ఉన్నారు.

ఆశ్రమాలకు బియ్యం వితరణ

ఆశ్రమాల్లో నిరుపేదలు, అనాథ వృద్ధులకు అండగా నిలువడం అభినందనీయమని ఎమ్మెల్యే కృష్ణారావు అన్నారు. శనివారం బాలాజీనగర్ డివిజన్ పరిధిలోని పీఎన్‌ఎం పాఠశాల ఆధ్వర్యంలో శివానంద ఆశ్రమం, అమ్మానాన్న ఫౌండేషన్, వైదేహి ఫౌండేషన్‌తో పాటు మరికొన్ని ఆశ్రమాలకు 90 క్వింటాళ్ల బియ్యాన్ని ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పీఎన్‌ఎం పాఠశాల వారు ప్రతి ఏటా సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, పాఠశాల వ్యవస్థాపకులు సీహెచ్ హన్మంతరావు, అశ్విని సుబ్బారావు, జలంధర్ తదితరులున్నారు.

దివ్యాంగులకు మూడు చక్రాల బ్యాటరీ సైకిళ్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కేపీహెచ్‌బీ కాలనీలో అక్రమ నిర్మాణం సీజ్

కేపీహెచ్‌బీ కాలనీ, డిసెంబర్ 7 : కేపీహెచ్‌బీ కాలనీ 15వ ఫేజ్‌లో అక్రమ నిర్మాణాన్ని సీజ్ చేసినట్లు టౌన్ ప్లానింగ్ ఏసీపీ మెహ్రా తెలిపారు. మూసాపేట సర్కిల్ పరిధిలోని కేపీహెచ్‌బీ కాలనీ 15వ ఫేజ్‌లో హెచ్‌ఐజీ 67లో... స్టిల్ట్ ప్లస్ ఫోర్‌కు అనుమతి తీసుకున్న యజమాని నిబంధనలను అతిక్రమిస్తూ స్టిల్ట్ ప్లస్ ఐదు ఫ్లోర్లతో పాటు పెంట్‌హౌస్‌ను నిర్మించాడు. జీహెచ్‌ఎంసీ నుంచి నోటీసులు ఇచ్చినప్పటికీ అక్రమ నిర్మాణాన్ని కొనసాగించడంతో శుక్రవారం టౌన్‌ప్లానింగ్ అధికారులు అక్రమ నిర్మాణాన్ని సీజ్ చేశారు. భవన యజమానులు జీహెచ్‌ఎంసీ నిబంధనలు పాటిస్తూ నిర్మాణాలు చేపట్టాలని, అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఏసీపీ హెచ్చరించారు.

మినీ జాతీయ బ్యాడ్మింటన్ పోటీల్లో బౌరంపేట్ విద్యార్థికి గోల్డ్‌మెడల్

దుండిగల్,డిసెంబర్ 7 : దుండిగల్ మున్సిపాలిటీ పరిధి బౌరంపేట్‌కు చెందిన విద్యార్థి కోరుకొండ లియోషా జాతీయస్థాయి బ్యాడ్మింటన్‌లో సత్తా చాటింది. మహారాష్ట్రలోని థానేలో ఈనెల 4 నుంచి 7 వరకు జరిగిన అండర్-11 మూడవ మినీ జాతీయ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్-202 పోటీల్లో పాల్గొని విజేతగా నిలిచి గోల్డ్ మెడల్‌ను సాధించింది. అదేవిధంగా డబుల్స్‌లోనూ గోల్డ్‌మెడల్ సాధించింది. లియోషా ప్రస్తుత బౌరంపేట్‌లోని ఓ ప్రైవేట్ పాఠశాలలో గ్రేడ్-4 చదువుతున్నది. లియోషాను కోచ్ సుమిత్‌రెడ్డి అభినందించారు.

అన్నమాచార్య భావనా వాహినిలో ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు

మాదాపూర్, డిసెంబర్ 7: మాదాపూర్‌లోని అన్నమాచార్య భావనా వాహినిలో పద్మశ్రీ పురస్కార గ్రహీత, డాక్టర్ శోభరాజు ఆధ్వర్యంలో శనివారం భావనా వాహిని విద్యార్థులు కళాకారులతో కలిసి నృత్య ప్రదర్శన నిర్వహించారు. తొలుత విష్ణు సహస్ర నామ, గురుస్తుతి చేశారు. శ్రీ భాస్కర డ్యాన్స్ అకాడమీ సంస్థ గురువు డి. సాత్విక శిష్య బృందంతో లక్ష్మీప్రణతి, హోష్ణ వి, శరణ్య, తను శ్రీ, ఆరాధ్య, జాహ్నవి, శరణ్య, మనస్విని, హసిని, అక్షిత, సహస్ర, ప్రజ్ఞ, ధరనిత, మోక్ష సంయుక్తంగా గణపతి తాళం, వారాహి, అల్లో నేరెల్లో, అష్టలక్ష్మీ గరుడ గమన, తిరు తిరు జవరాల, పాట్ డ్యాన్స్, మహ గణపతి, తెలుగు భాష విజయం, దశావతారం సంకీర్తనలకు నృత్య ప్రదర్శనలు చేసి భక్తులను ఆకట్టుకున్నారు. అనంతరం సంస్థ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ నందకుమార్, వ్యవస్థాపకురాలు,పురస్కార గ్రహీత, డాక్టర్ శోభరాజు కళాకారులకు జ్ఞాపికలను అందజేసి ప్రశంసించారు. వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

దుండిగల్, డిసెంబర్ 7 : విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని దుండిగల్ మున్సిపల్ వైస్ చైర్మన్ తుడుం పద్మారావు అన్నారు. మున్సిపాలిటీ పరిధి గాగిల్లాపూర్‌లోని ఓ ప్రైవేట్ పాఠశాలలో జరుగుతున్న వాలీబాల్ టోర్నమెంట్‌కు బీఆర్ఎస్ కుత్బుల్లాపూర్ నాయకుడు, కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణతో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులకు శారీర ధారుడ్యం పెరుగుదలతోపాటు మానసికంగా దృఢంగా ఉండేందుకు క్రీడలు ఉపయోగపడుతాయన్నారు. కొద్దిసేపు విద్యార్థులతో కలిసి వారు వాలీబాల్ ఆడి ఉత్సాహ పరిచారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు సుధాకర్‌రెడ్డి, మహేందర్‌యాదవ్, భరత్‌కుమార్, శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి త్రోబాల్ పోటీలకు ఎంపిక

జవహర్‌నగర్, డిసెంబర్ 7: జాతీయస్థాయి త్రోబాల్ పోటీలకు సీఆర్‌పీఎఫ్ విద్యార్థులు ఎంపికయ్యారు. పాఠశాల ప్రిన్సిపాల్ డి. అపర్ణ, ఫిజికల్ డైరెక్టర్ రాజశేఖర్ ఆధ్వర్యంలో ఎంపికైన విద్యార్థులను శనివారం అభినందించారు. ఈనెల 9న మధ్యప్రదేశ్ రాష్ట్రం ఇండోర్‌లో జరిగే జాతీయస్థాయి త్రోబాల్ పోటీల్లో నవతేజ, రిత్విక్, దేవానంద్‌సాగర్, మాధవి భరత్, లాస్యప్రియ, శివ సాగర్ పాల్గొంటారని తెలిపారు.

కేటీఆర్ పర్యటనను విజయవంతం చేయాలి

● 9న గండిమైసమ్మలో బీఆర్ఎస్ మేడ్చల్ జిల్లా కార్యాలయం ప్రారంభం

గాజులరామారం డివిజన్ సమావేశంలో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

దుండిగల్, డిసెంబర్ 7 : మున్సిపాలిటీ పరిధి గండిమైసమ్మలో ఈనెల 9న బీఆర్ఎస్ మేడ్చల్ జిల్లా కార్యాలయాన్ని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రారంభించనున్నారు. గులాబీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొని కేటీఆర్ పర్యటనను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ నాయకులు పిలుపునిచ్చారు. శనివారం గాజులరామారం, కుత్బుల్లాపూర్ పరిధిలోని పలు డివిజన్లతోపాటు నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్, దుండిగల్, కొంపల్లి మున్సిపాలిటీల్లో పార్టీ నాయకులు సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. మాజీ మంత్రి కేటీఆర్ 9న గండిమైసమ్మలో బీఆర్ఎస్ జిల్లా కార్యాలయాన్ని ప్రారంభించడంతో పాటు చౌరస్తాలో ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరిస్తారన్నారు. పార్టీ కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కాగా ఆదివారం ఇందుకు సంబంధించిన సన్నాహక సమావేశం గండిమైసమ్మలో బీఆర్ఎస్ కార్యాలయంలో ఎమ్మెల్సీ అధ్యక్షుడు శంభీపూర్ రాజు, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ఆధ్వర్యంలో జరుగుతుందన్నారు.

జైలు అదాలత్.. 45 కేసులు పరిష్కారం

చర్లపల్లి, డిసెంబర్ 7 : చర్లపల్లి కేంద్ర కారాగారంలో శనివారం జైలు అదాలత్ నిర్వహించి.. 45 కేసులను పరిష్కరించి, 26 మంది ఖైదీలకు విముక్తి కల్పించారు. కేంద్ర కారాగారంలో జిల్లా రెండవ అదనపు జూనియర్ జడ్జి జె.ప్రశాంతి, 9వ అదనపు మెట్రోపాలిటన్ జడ్జి ఎస్.ఆర్.దిలీప్‌కుమార్ నాయక్‌లు పాల్గొన్న పలువురు ఖైదీలను విచారించి .. కేసులను పరిష్కరించారు. అనంతరం ఖైదీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ రామచంద్రం, డిప్యూటీ సూపరింటెండెంట్లు, జైలర్లు, డిప్యూటీ జైలర్లు, సిబ్బంది, ఖైదీలు, తదితరులు పాల్గొన్నారు.

అలరించిన గాత్ర, నృత్య ప్రదర్శనలు

కొండాపూర్, డిసెంబర్ 7 : వారాంతపు సాంస్కృతిక ప్రదర్శనల్లో భాగంగా శనివారం మాదాపూర్‌లోని శిల్పారామంలో పలువురి కళాకారుల గాత్ర, నృత్య ప్రదర్శనలు సందర్శకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. మధురిమ, అరుణిమ వీణపై తమ గాత్ర కచేరితో సందర్శకులను ఆకట్టుకోగా, డాక్టర్ చంద్రతప సహరాయ్ తన శిష్య బృందంతో కలిసి సరస్వతి వందన, శివ వందన, ధూపత్తల్, దర్బారీ తాల్, గంగ అవతరణ, రూపక తాళ్ అంశాలను కథక్ రూపకంలో సర్వజ్ఞ, శాన్వీ, ప్రీతి, వైష్ణవి, ఆరాధ్య, సుభద్ర, త్రిప్తి, మీద, సాచి, నైనికా,అంబికా, అవని అద్భుత రీతిలో నర్తించి అలరించారు.

శాస్త్ర, సాంకేతిక రంగాలపై అవగాహన పెంచుకోవాలి

టాక్‌షోలో పాల్గొన్న కరుణకుమారి, విద్యార్థులు

దుండిగల్,డిసెంబర్ 7 : పాఠశాల దశ నుంచే విద్యార్థులు శాస్త్ర,సాంకేతిక రంగాలపై అవగాహన పెంచుకోవాలని డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్ అనలిటికల్ సైంటిస్ట్ కరుణకుమారి అన్నారు. గాజులరామారం సర్కిల్ సూరారంలోని ఐరిష్ ఫ్లోరెట్స్ వరల్డ్ స్కూల్‌లో శనివారం జరిగిన కార్యక్రమంలో కరుణకుమారి పాల్గొని విద్యార్థులతో మాట్లాడారు. శాస్త్ర,సాంకేతిక రంగాలల్లో ప్రపంచ వ్యాప్తంగా రోజురోజుకు చోటుచేసుకుంటున్న నూతన ఆవిష్కరణలు, పరిశోధనలపై విద్యార్థులు దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ తులసీకుమారి, చైర్మన్ టీ. శిరీష్, విద్యార్థులు పాల్గొన్నారు.

పాస్టర్లకు బీఆర్ఎస్ నేత దుస్తుల పంపిణీ

మియాపూర్, డిసెంబర్ 7 : క్రిస్మస్ పండుగను పుర స్కరించుకుని ఆల్విన్ కాలనీ డివిజన్ ఇంద్రహిల్స్ జెరూ సలేం ప్రార్థన మందిరంలో శనివారం సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. బీఆర్ఎస్ నాయకుడు ఎర్రబెల్లి సతీశ్‌రావు వేడుకలు, ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొని పాస్టర్లకు క్రిస్మస్ కానుకగా దుస్తులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ హయాంలో క్రిస్మస్ కానుకలను పంపిణీ చేశారని, అన్ని మతాలను సమానంగా ఆదరించారని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు రాములు, సాయి, చంద్రశేఖర్, బాలస్వామి, ఆజయ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

సుబ్రమణ్య స్వామికి షష్టి పూజలు

మియాపూర్, డిసెంబరు 7 : సుబ్రమణ్య షష్టిని పురస్కరించుకుని శనివారం వివేకానందనగర్ డివిజన్ చైతన్యనగర్ నాగదేవత ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. 108 కిలోల భస్మార్చన కార్యక్రమాన్ని వేదోక్తంగా నిర్వహించారు. కార్పొరేటర్ మాధవరం రోజాదేవి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆరోగ్య ప్రదాతగా సుబ్రమణ్యేశ్వర స్వామిని నిత్యం పూజించాలన్నారు.కార్యక్రమంలో నర్సయ్య, బాలరాజు, నర్సింగ్‌రావు, అనిల్, మల్లేశ్, పవన్, కిరణ్ పాల్గొన్నారు.

సీపీఎం జెండా ఆవిష్కరణ

రోడామిస్త్రీనగర్‌లో సీపీఎం జెండా ఆవిష్కరణలో పాల్గొన్న లక్ష్మణ్ తదితరులు

దుండిగల్,డిసెంబర్ 7 : సీపీఎం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మూడో మహాసభలు శనివారం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రగతినగర్‌లో జరిగాయి. ఈ సభలకు కుత్బుల్లాపూర్, గాజులరామారం జంటసర్కిళ్లకు చెందిన పార్టీ కార్యకర్తలు, నాయకులు తరలివచ్చారు. కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్ గాజులరామారం డివిజన్ పరిధి రోడమేస్త్రీనగర్‌లో ఏర్పాటు చేసిన పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ర్యాలీగా బయల్దేరి ప్రగతినగర్‌కు చేరుకున్నారు. కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు రావుల స్వాతి, అంసయ్య, దేవదానం, కరుణాకర్, జాకీర్, అంబయ్య, బాష, మల్లారెడ్డి, ఆంజనేయులు, ముక్తార్, ఆరిఫ్, నర్సింహులు, సాయి, ఖలీల్, షఫీ పాల్గొన్నారు.

పోగొట్టుకున్న బంగారు గొలుసు అప్పగింత

బంగారు గొలుసును మేఘనకు అప్పగిస్తున్న బాచుపల్లి పోలీసులు

దుండిగల్, డిసెంబర్ 7 : షాపింగ్‌కు వెళ్లిన ఓ యువతి పోగొట్టుకున్న బంగారుగొలుసును బాచుపల్లి పోలీసులు తిరిగి అమెకు అప్పగించారు. పోలీసుల కథనం ప్రకారం... నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి బాచుపల్లిలోని మహిత ప్లైడ్ అపార్ట్‌మెంట్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మేఘన ఈనెల 6న రాత్రి 9గంటల ప్రాంతంలో సరుకులు కొనుగోలు చేసేందుకు నిజాంపేట్‌లోని డీ మార్ట్‌కు వెళ్లింది. అనంతరం ఇంటికి చేరుకుని పరిశీలించగా మెడలోని 15 గ్రాముల బంగారు గొలుసు కనిపించలేదు. ఇంట్లోనే పడిపోయి ఉంటుందని ఇల్లంతా వెతికినా కనబడకపోవడంతో శనివారం సాయంత్రం బాచుపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దాంతో పోలీసులు సీసీ కెమెరాలు పరిశీలించగా కారు పార్కింగ్ చేసేచోట గొలుసు మూలన పడిపోయినట్లు గుర్తించారు. వెంటనే దానిని తీసుకుని బాధితురాలికి అప్పగించారు. బాధిత యువతి పోలీసులకు కృతజ్ఞతలు తెలిపింది.

మోక్షాదృతికి సమ్మోహన నృత్య దీపిక అవార్డు

ఘట్‌కేసర్ రూరల్, డిసెంబర్ 7: కూచిపూడి నృత్యంలో అత్యంత ప్రతిభా పాటవాలను ప్రదర్శించిన కుమారి మోక్షా దృతి సమ్మోహన నృత్య దీపిక అవార్డు అందుకున్నారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ ఎన్ఎఫ్ఈనగర్‌కు చెందిన కూచిపుడి నృత్య కళాకారిణి కుమారి మోక్షాదృతి తెలంగాణ సారస్వత పరిషత్‌లో తెలంగాణ జాగృతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం జరిగిన నృత్య పుష్పాంజలి కార్యక్రమంలో పాల్గొన్నారు. సమ్మోహన నృత్య దీపిక అవార్డును మోక్షాదృతికి అందజేసి అభినందించారు. ఫౌండేషన్ అధ్యక్షుడుపద్మ వెంకటేశ్, కార్యదర్శి రామదాసు, నాట్య గురువు జాన్సీరాం పాల్గొన్నారు.

నిఫ్ట్‌లో అట్టహాసంగా కాన్వొకేషన్

కార్యక్రమంలో మాట్లాడుతున్న కేంద్ర టెక్స్‌టైల్స్ శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్

మాదాపూర్, డిసెంబర్ 7: మాదాపూర్‌లోని నిఫ్ట్(నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ)లో 27వ కాన్వొకేషన్ వేడుక శనివారం అట్టహాసంగా జరిగింది. ముఖ్య అతిథిగా కేంద్ర టెక్స్‌టైల్స్ శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్ విచ్చేసి నిఫ్ట్ నిర్వాహకులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం నిఫ్ట్‌లోని కొత్త అకడమిక్ బ్లాక్‌ను(బాలికల హస్టల్ భవనం) ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో ఉపాధి అవకాశాలను మరింత పెంచాలన్నారు. అనంతరం నిఫ్ట్ డీజీ, ఐఏఎస్ తనూ కశ్యప్ నిఫ్ట్ విద్యార్థులను అభినందించారు. విద్యార్థులు తమ కుటుంబాలతో కనెక్ట్ కావాలని, వ్యక్తిగత, వృత్తిపరమైన జీవితాల మధ్య సమతుల్యత సాధించాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో నిఫ్ట్ అధ్యాపక బృందంతో పాటు విద్యార్థులు ఉన్నారు.

షాద్‌నగర్ ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలి

మియాపూర్, డిసెంబర్ 7 : వెలమ కులస్తులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకర్‌పై కాంగ్రెస్ పార్టీ అధిష్టానం చర్యలు తీసుకోవాలని వివేకానందనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సీఎం, పీసీసీ అధ్యక్షుడు, స్పీకర్ ప్రోద్బలంతోనే ఆయన ఈ వ్యాఖ్యలు చేసినట్లు భావించాల్సి వస్తుందని పేర్కొన్నారు. ఎమ్మెల్యే వ్యాఖ్యలు అత్యంత బాధాకరమని, మునుపెన్నడూ ఏ ప్రజాప్రతినిధీ ఇలా ఓ కులాన్ని దూషించిన దాఖలాలు లేవన్నారు. సీఎం అండ చూసుకునే ఎమ్మెల్యే శంకర్ రెచ్చిపోయి వెలమలపై నోరు పారేసుకున్నారని అన్నారు. తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ అన్ని కులాలను సమానంగా చూస్తూ అందరికీ స్థలాలు ఇచ్చి ఆదరించారని తెలిపారు. ఏ ఉద్దేశంతో వెలమలను ఎమ్మెల్యే దూషించారో? సమాధానం చెప్పాలని మాజీ కార్పొరేటర్ ప్రశ్నించారు. ఆయనపై తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని మహిళకు తీవ్ర గాయాలు

గాయపడిన మహిళను ఆసుపత్రికి తరలిస్తున్న ట్రాఫిక్ సిబ్బంది, స్థానికులు

కుత్బుల్లాపూర్, డిసెంబర్ 7 : ఆర్టీసీ బస్సు డ్రైవర్ నిర్లక్ష్యానికి ఓ మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. అదే సమయంలో అక్కడే విధుల్లో ఉన్న ట్రాఫిక్ కానిస్టేబుల్, స్థానికుడు సకాలంలో స్పందించి బాధితురాలిని దవాఖానకు తరలించారు. ఈ ఘటన బాలానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. పోలీసుల వివరాల ప్రకారం.. శనివారం ఉదయం ఐడీపీఎల్ జంక్షన్ వద్ద అడ్డగుట్ట చంద్రకళ(60) రోడ్డు దాటుతున్నది. అదే సమయంలో ఆర్టీసీ బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంగా ర్యాష్‌డ్రైవింగ్ చేస్తూ ఆమెను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో చంద్రకళ కుడికాలుకు తీవ్ర గాయాలయ్యాయి. అక్కడే విధుల్లో ఉన్న జీడిమెట్ల ట్రాఫిక్ కానిస్టేబుల్ హనుమయ్యతో పాటు స్థానిక యువకుడు వెంటనే ఆమెను ఎత్తుకుని ట్రాఫిక్ సీఐ శ్రీనివాస్ సహకారంతో ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు. దీంతో కానిస్టేబుల్ హనుమయ్యతో పాటు యువకుడిని స్థానిక ప్రజలు, బాధితురాలి కుటుంబ సభ్యులు అభినందించారు. ట్రాఫిక్ సీఐ ఫిర్యాదు మేరకు బాలానగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సీఎంఆర్‌లో బీటూబీ ప్రాజెక్టు ఎక్స్‌పో

మేడ్చల్, డిసెంబరు 7 : గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ కండ్లకోయలోని సీఎంఆర్ సెట్‌లో బీటూబీ(బడ్ టూ బిజినెస్) పేరుతో శనివారం ప్రాజెక్టు ఎక్స్ పో నిర్వహించారు. ఈ ప్రాజెక్టు ఎక్స్‌పో ప్రారంభించిన సందర్భంగా సీఎంఆర్ చైర్మన్ గోపాల్ రెడ్డి మాట్లాడారు. విద్యార్థులు మరిన్ని ఆవిష్కరణలు చేయాలని సూచించారు. ప్రాజెక్ట్ ఎక్స్‌పో 64 జట్లు పాల్గొనగా, ఎంపిక చేసిన మూడు జట్లకు నగదు బహుమతులు, ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో సీఈవో అభినవ్ రెడ్డి, ప్రిన్సిపాల్ నారాయణ, సీఈఈఆర్ హెచ్‌వోడీ సురేశ్‌రామ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

కీసరగుట్టలో చండీహోమం

కీసర, డిసెంబర్ 7: కీసరగుట్ట ఆలయంలో వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య శనివారం చండీహోమాన్ని నిర్వహించారు. ఈహోమంలో భక్తులు పాల్గొన్నారు. కీసరగుట్టలో పాపులర్ సింగర్ పెద్దపుల్లి ఈశ్వర్ తన శిష్యులతో చేరుకొన్నారు. స్వామివారికి పూజలు చేశారు.

మాజీ ఎంపీకి జన్మదిన శుభాకాంక్షలు

మల్లాపూర్ : మాజీ రాజ్యసభ సభ్యుడు జోగినిపల్లి సంతోష్‌కుమార్ జన్మదినం సందర్భంగా శనివారం ఆయనను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపిన మీర్‌పేట్ హెచ్‌బీకాలనీ డివిజన్ బీఆర్ఎస్ మాజీ ప్రధాన కార్యదర్శి ప్రసాద్‌గౌడ్.

పరికిచెరువు పరిసరాల్లో దోమల మందు పిచికారీ

మియాపూర్, డిసెంబరు 7 : ఆల్విన్‌కాలనీ డివిజన్ గురుగోవింద్ సింగ్ నగర్‌లోని పరికిచెరువు పరిసరాల్లో దోమల నివారణకు చర్యలు చేపడుతున్నట్లు కార్పొరేటర్ వెంకటేశ్‌గౌడ్ పేర్కొన్నారు. ఎంటమాలజీ సిబ్బందితో శనివారం ఆయన దోమల నివారణకు తిమేపాస్ కెమికల్‌ను డ్రోన్ సాయంతో పిచికారీ చేయించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. చెరువు పరిసరాల్లో నివసించే ప్రజలు వ్యర్థాలను చెరువులో వేయవద్దని కోరారు.

కూకట్‌పల్లి రైతుబజార్‌లో కూరగాయల ధరలు

కేపీహెచ్‌బీ కాలనీ, డిసెంబర్ 7 : కూకట్‌పల్లి (కేపీహెచ్‌బీ కాలనీ) రైతుబజార్‌లో శనివారం కూరగాయల ధరలు కింది విధంగా ఉన్నాయి.(కేజీ-రూపాయలలో..) టమాట 29, వంకాయ 28, బెండకాయ 28, పచ్చిమిర్చి 33, బజ్జి మిర్చి 35, కాకరకాయ 23, బీర కాయ 38, క్యాబేజి 19, ఫ్రెంచ్ బీన్స్ 35,క్యారెట్ 47, కాలీఫ్లవర్ 18, దొండ 28, చిక్కుడు 45, గోరుచిక్కుడు 23, బీట్‌రూట్ 40, క్యాప్సికం 55, ఆలుగడ్డ 36, కీరదోస 25, దోసకాయ 18, సొరకాయ 20, పొట్లకాయ (1) 20, కందగడ్డ 55, ఉల్లిపొరక 40, ఉల్లిగడ్డ 49, చింతకాయ-, మామిడికాయ(1) 15 నుంచి 20, అరటికాయ(1) 8 నుంచి 9, చామగడ్డ 35, ముళ్లంగి (1) 4 నుంచి 5, మొరంగడ్డ 30, గుమ్మడికాయ 40, నిమ్మకాయలు(12) 30 నుంచి 40, మునగకాయ(1) 18 నుంచి 20, పచ్చి బఠాని 75, పొప్పడికాయ 40, పుట్టగొడుగులు (200గ్రా.) 40, ఎండుమిర్చి 220, అల్లం 160, వెల్లుల్లి 400, చింతపండు 140, కరివేపాకు రూ.80గా ఉన్నాయి. ఈ ధరలు నేటి ఉదయం 9.30 గం టల వరకు రైతుబజార్‌లో అమలులో ఉంటాయని ఎస్టేట్ ఆఫీసర్ సుధాకర్ తెలిపారు.

ముసాయిదా జాబితా